క్లుప్తంగా

ఆయన చూపు సజీవం


నేత్రదానం చేసిన వారణాశి కనకరాజు

చీపురుపల్లి: పట్టణంలోని కస్పావీధికి చెందిన గురుస్వామి వారణాశి కనకరాజు (75) అనారోగ్యంతో శనివారం మృతి చెందారు. ఆయన నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. మానవీయత స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు, రెడ్‌క్రాస్ సొసైటీ మేనిజింగ్ కమిటీ సభ్యుడు బి.వి.గోవిందరాజులు, రెడ్‌క్రాస్ టెక్నీషియన్స్ సుధాకర్, రమణ మృతిడి కార్నియాలను సేకరించి ఎల్.వి.ప్రసాద్ నేత్ర నిధికి అప్పగించారు.

లావాదేవీలపై అవగాహన


సమావేశంలో మాట్లాడుతున్న ఏపీఎం రాజశేఖర్

మెరకముడిదాం: మొబైల్‌బుక్ కీపింగ్‌పై డ్వాక్రా సంఘాల మహిళలకు అవగాహన అవసరమని వెలుగు ఏపీఎం రాజశేఖర్ అన్నారు. వెలుగు కార్యాలయంలో మండలానికి చెందిన వీఓఏ అధ్యక్షులు, వీఓఏలతో ఆయన శనివారం సమావేశమయ్యారు. వెలుగు ద్వారా నిర్వహిస్తున్న పొదుపు, స్త్రీనిధి రుణాల లావాదేవీలన్నీ మహిళలు తమ వ్యక్తిగత మొబైల్స్‌లో తెలుసుకునే సౌకర్యాన్ని ప్రభుత్వం యాప్ ద్వారా అందిస్తుందని తెలిపారు. స్త్రీనిధి రుణాలతో పాటు అన్ని రకాల రికవరీలను 100 శాతం పూర్తి చేయాలని రాజశేఖర్ సూచించారు.

హోమియో వైద్య శిబిరం


శిబిరంలో సేవలందిస్తున్న వైద్యాధికారులు శిరీష, గంగసింధూ

వేపాడ: స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మండలంలోని వల్లంపూడిలో శనివారం హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని జెడ్పీటీసీ ఎస్.అప్పారావు ప్రారంభించారు. శిబిరంలో హోమియో వైద్యాధికారి శిరీష, ఆయుర్వేదిక్ వైద్యాధికారి గంగ సింధూ, వేపాడ పీహెచ్‌సీ వైద్యాధికారులు వేణు,సంజన ఆధ్వర్యంలో గ్రామస్తులకు వైద్యపరీక్షలు చేశారు. అవసరమైన ఉచితంగా హోమియో, ఆయుర్వేద మందులు అందజేశారు. మహిళలకు క్యాన్సర్ స్క్రీనింగ్ టెస్టులు చేశారు.

వేంకటేశ్వరస్వామికి విశిష్టపూజలు


పూజలందుకుంటున్న వేంకటేశ్వరస్వామి

జామి: మండలంలోని భీమసింగి సుగర్‌ఫ్యాక్టరీ వద్ద ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో అర్చకులు శనివారం విశిష్ట పూజలు జరిపారు. స్వామివారిని తులసీదళాలతో విశిష్ట అలంకరణ చేశారు. స్వామివారిని దర్శించుకున్న భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

నిరుపయోగం


మూతబడిన బీఎస్ఎన్ఎల్ కార్యాలయం

లక్కవరపుకోట: మండల కేంద్రంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం నిరుపయోగంగా మారింది. భవనం లోపల ఉన్న ఏసీలు, ఫర్నిచర్ తదితర విలువైన సామగ్రి పాడవుతోంది. అధికారులు స్పందించి భవనాన్ని వినియోగంలోకి తేవాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు.

మిమ్స్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

నెల్లిమర్ల: ఉద్యోగులను వేధిస్తున్న మిమ్స్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా నాయకుడు టీవీ రమణ డిమాండ్ చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. మిమ్స్ యాజమాన్యం కావాలనే ఉద్యోగులను దూరప్రాంతాలకు బదిలీ చేస్తోందని ఆరోపించారు. దీనిలో భాగంగానే కొండగుంపాం గ్రామానికి చెందిన యడ్ల గౌరీని విజయనగరం అర్బన్ మిమ్స్ సెంటర్ నుంచి బొబ్బిలి బదిలీ చేయడంతో.. ఆమె మనస్తాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడిందన్నారు.

బాలకృష్ణ తక్షణమే క్షమాపణ చెప్పాలి

వేపాడ:

మాజీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డితో పాటు సినీనటుడు మెగాస్టార్ చిరంజీవిపై హిందూపురం ఎమ్మెల్యే, సినీ నటుడు నందమూరి బాలకృష్ణ అసెంబ్లీలో అనుచిత వ్యాఖ్యలు చేయడంపై మండల వైఎస్సార్‌సీపీ నేతలు మండల కేంద్రంలోడాక్టర్ బి.ఆర్. అంబేడ్కర్ విగ్రహం వద్ద శనివారం నిరసన తెలిపారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు ముమ్ముల్లూరి జగ్గుబాబు మాట్లాడుతూ బాలకృష్ణ అసెంబ్లీలో జగన్‌మోహన్‌రెడ్డి, చిరంజీవిపై చేసిన వ్యాఖ్యలను తక్షణమే ఉపసంహరించుకుని బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. సభలో లేని వ్యక్తులపై అసందర్భంగా, పరుష పద జాలంతో బాలకృష్ణ మాట్లాడడం ప్రజలను విస్మయానికి గురిచేసిందన్నారు.

ప్రభుత్వం స్పందించి బాలకృష్ణపై చర్యలు తీసుకోవాలని కోరారు. బాలకృష్ణ దిష్టిబొమ్మను దగ్ధం చేసి, ఆయనకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు నిరుజోగి వెంకటరావు, జేసీఎస్ కన్వీనర్ బోజంకి శ్రీను, ఆతవ సర్పంచ్ గొంప వేమన నాయుడు, ఎంపీటీసీ టి.వి.రమణ, నాయకులు బీల సతీష్, గండి శ్రీరామ్మూర్తి, నిరుజోగి శ్రీను,వంటాకు శ్రీను, దేబార్కి అప్పారావు, దేబార్కి కిరణ్, మిరపాక రమణ, జ్యోతి ప్రకాష్, శానాపతి ఈశ్వరరావు, నెక్కల వెంకటరావు ,కొప్పెలమూర్తి, తదితరులు పాల్గొన్నారు.


అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


బాలకృష్ణ దిష్టిబొమ్మను దగ్ధం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

బాలకృష్ణ అసలైన సైకో

- ఎమ్మెల్యే పదవి నుంచి బర్తరఫ్ చేయాలి
- చిరంజీవిని అమర్యాదగా మాట్లాడడం దారుణం
- అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసిన వైఎస్సార్‌సీపీ నాయకులు

చీపురుపల్లి: నిర్మాతలపై తుపాకీ కాల్పులు జరపడం, అభిమానులను ఇష్టానుసారంగా కొట్టడం, తన్నడం, మొబైల్ ఫోన్‌లు లాక్కుని రోడ్డుకేసి కొట్టడం వంటి ప్రవర్తన కలిగిన బాలకృష్ణ అసలు సిసలైన సైకో అని రాష్ట్రంలోని ప్రజలందరికీ తెలుసని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు వలిరెడ్డి శ్రీనివాసనాయుడు, పార్టీ మండలాధ్యక్షుడు మీసాల వరహాలనాయుడు, యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు బెల్లాన వంశీకృష్ణ అన్నారు. అసెంబ్లీలో బాలకృష్ణ వ్యాఖ్యలు నిరసిస్తూ శనివారం పట్టణంలోని లావేరురోడ్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. అనంతరం అక్కడ బాలకృష్ణ డౌన్ డౌన్, ఎమ్మెల్యే పదవి నుంచి బర్తరఫ్ చేయాలంటూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సినిమా పరిశ్రమను ఎంతో గౌరవంగా చూసి వారికి కావాల్సిన సదుపాయాలు కల్పించిన మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డిని సైకో అనడం, సినిమా పరిశ్రమలో ఎంతో హుందా కలిగిన చిరంజీవిను వాడు, వీడు అనడం దారుణమన్నారు. ఎర్రగడ్డ పిచ్చాస్పత్రి నుంచి ధ్రువీకరణ పత్రం పొందిన వ్యక్తి ఎమ్మెల్యేగా ఎలా కొనసాగుతారని ప్రశ్నించారు. జగన్‌మోహన్‌రెడ్డి సినీ పరిశ్రమ పెద్దలకు ఇచ్చిన గౌరవంపై చిరంజీవి చాలా స్పష్టంగా వివరించినట్లు గుర్తుచేశారు. కార్యక్రమంలో మేజర్ పంచాయతీ సర్పంచ్ మంగళగిరి సుధారాణి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఇప్పిలి తిరుమల, గవిడి సురేష్, కరణం ఆది, కోరుకొండ దాలయ్య, కర్రోతు ప్రసాద్, మజ్జి శంకర్, మండల రాజారావు, రెల్లి శివ తదితరులు పాల్గొన్నారు.

రేబిస్ ప్రాణాంతకం

- నేడు వరల్డ్ రేబిస్ డే


వేపాడ పశువైద్యాధికారి గాయత్రీ

వేపాడ: రేబిస్ ఒక ప్రాణాంతక వ్యాధి అని, జంతువుల కాటు వల్ల, రక్కటం వల్ల ఇది మానవులకు వ్యాపిస్తుందని వేపాడ పశువైద్యాధికారి గాయత్రీ తెలిపారు. ఆదివారం ప్రపంచ రేబిస్ డే నేపథ్యంలో రేబిస్ వ్యాధి లక్షణాలు, వ్యాధి ఎలా వ్యాపిస్తుంది, తదితర అంశాలను శనివారం ఆమె సాక్షికి వివరించారు. రేబిస్ ప్రాణాంతక వ్యాధి అని, ఇది కేంద్ర నాడీ వ్యవస్థను ప్రభావితం చేస్తుందని చెప్పారు.ఒక్కసారి ఈ వ్యాధి సోకిందంటే ఆ వ్యక్తులు బతకడం కష్టమని చెప్పారు.

రేబిస్‌పై అవగాహన కల్పించేందుకు ఏటా సెప్టెంబర్ 28న వరల్డ్ రేబిస్ డే నిర్వహిస్తున్నట్టు తెలిపారు.ఈ సంవత్సరం థీమ్ 'ఇప్పుడే చర్య తీసుకుందాం... నువ్వు నేను సమాజం' అన్న నినాదంతో రేబిస్ నివారణకు ప్రతీ ఒక్కరూ వ్యక్తిగతంగా, వృత్తిపరంగా సామూహికంగా చర్యలు తీసుకోవాలిన్న అవసరం ఉందన్నారు. 2030 నాటికి రేబిస్ వల్ల మరణాలను పూర్తిగా నిర్మూలించడానికి అంతా కృషిచేయాలని చెప్పా రు. వ్యాధి లక్షణాల ను వివరించారు.

వ్యాధి ఎలా వ్యాపిస్తుందంటే...

రేబిస్ వ్యాధి సోకిన జంతువులు మానవులను కాటు వేయడం,రక్కటం చేయడం వల్ల ఆ జంతువుల లాలాజలంలో ఉన్న లైసా వైరస్ మానవుల్లోకి వ్యాపిస్తుంది. రేబిస్ వ్యాధి సోకితే ప్రారంభంలో ఫ్లూలాంటి లక్షణాలు కనిపిస్తాయి. నాడీ వ్యవస్థపై ప్రభావం చూపుతుంది. జ్వరం రావడం, కాటు, రక్కిన చర్మభాగంలో తిమ్మిరి, వళ్లు జలదరించడం, ఆందోళన,గందరగోళం, మతి మరుపు, భ్రాంతులు కనిపించడం, శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది, పక్షవాతం (కదలకపోవటం) లాంటి లక్షణాలు ఉంటాయి. పెంపుడు జంతువులు, కుక్కలు కాటు వేసిన వెంటనే అశ్రద్ధ చేయకుండా వైద్యుడిని సంప్రదించి, రేబిస్ వ్యాక్సిన్ వేసుకోవడం వల్ల వైరస్ బారినపడకుండా ఉండవచ్చని వైద్యాధికారి తెలిపారు.

పరిశుభ్రతపై ప్రతిజ్ఞ



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

చీపురుపల్లి: పట్టణంలోని శ్రీనివాసా జూనియర్ కళాశాలలో శనివారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో స్వచ్ఛత–పరిశుభ్రతపై విద్యార్థులు, అధ్యాపకులు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో మండల స్వచ్ఛభారత్ కోఆర్డినేటర్ మీసాల లక్ష్మణరావు తెలిపారు.

ఐరన్ లోపం లేకుండా చూసుకోండి


పౌష్టికాహార ప్రదర్శనను తిలకిస్తున్న డాక్టర్ సుష్మ

గజపతినగరం: ప్రొటీన్స్,విటమిన్స్,మినరల్స్ ఉండే పోషకాహారాన్ని ఎక్కువగా తీసుకోవాలని, ప్రధానంగా మహిళలు ఐరన్ లోపం లేకుండా చూసుకోవాలని మరుపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి సుష్మ సూచించారు. తెలిపారు. పోషణ మాసోత్సవాల్లో భాగంగా మండలంలోని సీతారామపురం గ్రామంలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పౌష్టికాహారంపై గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు శనివారం అవగాహన కల్పించారు. వైద్యాధికారి మాట్లాడుతూ పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా సంపూర్ణ ఆరోగ్యంగా ఉండవచ్చని చెప్పారు..ప్రధానంగా చిరుధాన్యాలు, ఆకుకూరలు,పప్పులు,కూరగాయలు ఎక్కువగా తీసుకుంటే రక్తహీనత సమస్యరాదని అన్నారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలు శ్రీదేవి,పైడిరాజులు, తదితరులు ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాల్స్ ఆకట్టుకున్నాయి.

మూసుకుపోయిన రోడ్డు



వీరభద్రపురం కూడలి సమీపంలో ఇలా.., (ఇన్‌సెట్లో) దేవరాపల్లి-కొత్తవలస రోడ్డులో వియ్యంపేట సమీపంలో రోడ్డును సగానికిపైగా ఆక్రమించిన పిచ్చిమొక్కలు

కొత్తవలస:

ఇరువైపులా పెరిగిన జంగిల్‌తో కొత్తవలస మండలంలోని కొత్తవలస నుంచి దేవరాపల్లి వెళ్లే ఆర్అండ్‌బీ రోడ్డు మూసుకుపోయింది. ప్రమాదాలకు అడ్డాగా మారింది. వాహనాలను క్రాస్‌చేసే సమయంలో పలువురు ప్రమాదాల బారిన పడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డుకు ఇరువైపులా పెరిగిన పిచ్చిమొక్కలు, తుప్పలను తొలగించాలని ఈ ప్రాంతీయులు కోరుతున్నారు.

పార్టీ బలోపేతానికి పనిచేయాలి


మాజీ ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు చెబుతున్న శ్రీనివాసన్

దత్తిరాజేరు: కూటమి ప్రభుత్వంలో సవాళ్లను ఎదుర్కొని వైఎస్సార్‌సీపీ బలోపేతానికి పని చేయాలని జిల్లా లీగల్‌సెల్ ఉపాధ్యక్షుడు రాజేటి శ్రీనివాసన్‌కు మాజీ ఎమ్మెల్యే బొత్స అప్పలనర్సయ్య సూచించారు. పార్టీ లీగల్‌సెల్ బాధ్యతలు అప్పగించినందుకు మాజీ ఎమ్మెల్యేకు శ్రీనివాసన్ శనివారం కృతజ్ఞతలు తెలిపారు. దుశ్శాలువతో సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పార్టీ శ్రేణులను కలుపుకుని పనిచేస్తానని, వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటానని తెలిపారు.

రోడ్లపై మురుగు ప్రవాహం


టీచర్స్ కాలనీలో రోడ్డుపై పారుతున్న మురుగునీరు

శృంగవరపుకోట: పట్టణంలో పలు కాలనీల్లో కాలువలు లేకపోవడంతో మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తోంది. దీంతో పాదచారులు, వాహన చోదకులు నానా అగచాట్లు పడుతున్నారు. అఫీషియల్‌కాలనీ, టీచర్స్‌కాలనీ, శ్రీనివాస కాలనీ, ఏఓ హోమ్స్‌తో పాటు పలు లేఅవుట్లలో డ్రైన్లు లేక పట్టణవాసులు ఇబ్బందులు పడుతున్నారు. కాలువల నిర్మాణం చేయాలని అధికారులను కోరుతున్నారు.

ప్రశాంతంగా పైడితల్లి ఉత్సవాలు

- ఆర్డీఓ దాట్ల కీర్తి

విజయనగరం క్రైమ్: అధికారులందరూ సమన్వయంతో పనిచేసి ఉత్సవాలు ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని విజయనగరం ఆర్డీఓ దాట్ల కీర్తి అన్నారు. తన చాంబర్‌లో ఉత్సవ సమన్వయ కమిటీ సభ్యులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. రానున్న మూడు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని.. వాతావరణ పరిస్థితుల్ని దృష్టిలో పెట్టుకుని ఏర్పాట్లు చేయాలన్నారు. గుడి లోపల తోపులాటలు జరిగే అవకాశం ఉన్నందున క్యూలైన్లలో దర్శనాలు జరిగేలా చూడాలన్నారు. వీఐపీ దర్శనాలను ఒక్క నిమిషంలో పూర్తి చేయాలని ఆదేశించారు. సిరిమాను తిరిగే ప్రాంతాల్లో పాత భవనాల యజమానులకు నోటీసులు జారీ చేసి, ఆ భవనాలపై మనుషులు లేకుండా చూడాలని తెలిపారు. అత్యవసర వైద్య వాహనాలను అందుబాటులో ఉంచాలన్నారు. సమావేశంలో డీఎస్పీ ఆర్. గోవిందరావు, తహసీల్దార్ కూర్మనాథ్ , డీసీహెచ్ఎస్. పద్మశ్రీ రాణి,పోలీస్, దేవస్థానం సిబ్బంది, ఆర్ అండ్‌బీ, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

మహిళల పట్ల మర్యాదగా నడుచుకోవాలి


నెల్లిమర్ల రూరల్: మహిళల పట్ల ప్రతిఒక్కరూ మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని ఎస్సై గణేష్ సూచించారు. మండలంలోని సారిపల్లి రామమందిరం వద్ద శనివారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ.. మహిళలు, బాలికల పట్ల అనుచితంగా ప్రవర్తిస్తే చర్యలు తప్పవన్నారు. పోక్సో కేసు నమోదైతే జీవితాంతం జైలు జీవితం గడపాల్సి వస్తుందని హెచ్చరించారు. మాదకద్రవ్యాల వినియోగానికి యువత దూరంగా ఉండాలన్నారు.

చంద్రబాబు ప్రభుత్వంలో దళితులకు అవమానం


విలేకరులతో మాట్లాడుతున్న దళిత సంఘ నాయకులు

చీపురుపల్లి: చంద్రబాబునాయుడు ప్రభుత్వంలో నిరంతరం ఎస్సీలకు అవమానం జరుగుతూనే ఉంటుందని వైఎస్సార్‌సీపీ దళిత నాయకులు, చీపురుపల్లి మేజర్ పంచాయతీ సర్పంచ్ మంగళగిరి సుధారాణి అన్నారు. పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. శాసన మండలి స్పీకర్ కె. మోషేన్‌రాజును అసెంబ్లీ ఆవరణలో నూతన భవనాలు ప్రారంభోత్సవానికి ఆహ్వానించకపోవడం, టీటీడీలో భవనాల ప్రారంభోత్సవ శిలాఫలకంపై ఆయన పేరు లేకపోవడం అవమానకరమన్నారు. శాసన మండలి స్పీకర్ దళిత సామాజికవర్గానికి చెందిన వారు కావడం వల్లే ఇలా చేస్తున్నారన్నారు. దళితులు అంటే చంద్రబాబుకు ఎప్పుడూ చిన్నచూపేనన్నారు. ఎవరైనా దళితుడిగా పుట్టాలని కోరుకుంటారా అంటూ గతంలో చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు ప్రజలందరికీ గుర్తున్నాయని చెప్పారు. స్వాతంత్ర్యం శాసన మండలి స్పీకర్‌కు ప్రొటోకాల్ పాటించకపోవడం అప్రజాస్వామికమని అన్నారు. దీనిపై తక్షణమే సీఎం, డిప్యూటీ సీఎంలు దళితులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. దళితులకు ఇలాంటి అవమానాలు చేస్తే భవిష్యత్‌లో తగిన గుణపాఠం చెప్పక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో దళిత సంఘ నాయకులు కోరుకొండ దాలయ్య, పాలరాజు, ఆదినారాయణ, రామగురువులు, భవిరి రవిశంకర్, ఎత్తుల శ్రీను, కిషోర్, అప్పన్న, రవి, తదితరులు పాల్గొన్నారు.

వితంతువుపై రాజకీయ కక్ష

కళావతికి పింఛన్ మంజూరైనట్టు వచ్చిన ఐడీ

ఈ చిత్రంలో కనిపిస్తున్న మహిళ పేరు సారిక కళావతి. గంట్యాడ మండలం పెద వేమలి గ్రామం. ఆమె భర్త బోలయ్యకు వృద్ధాప్య పింఛన్ వచ్చేది. ఈ ఏడాది ఏప్రిల్ 7వ తేదీన అనారోగ్యంతో మరణించారు. ఆమెకు భాగస్వామి పింఛన్ (స్పౌజ్) కోటాలో అదే నెలలో దరఖాస్తు చేశారు. జూన్ నెల పింఛన్ మంజూరైందని, సచివాలయానికి రావాలని సమాచారం ఇచ్చారు. ఆ నెల పింఛన్ డబ్బులను ప్రభుత్వం విడుదల చేయకపోవడంతో అందలేదు. ఆగస్టు నెలలో కూటమి సర్కార్ భాగస్వామి పింఛన్లను గ్రామంలో ఐదుగురికి మంజూరు చేసింది. వీరిలో కళావతి పేరులేదు. దీనిపై సచివాలయ సిబ్బందిని ప్రశ్నించినా ఫలితం లేకపోయింది. పింఛన్లకు సంబంధించిన సెర్ప్‌శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ప్రాతినిధ్యం వహిస్తుంది ఈ నియోజకవర్గమేనని, రాజకీయ కక్షతోనే వితంతువు పింఛన్ నిలిపివేశారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. పింఛన్ మంజూరై నిలిపివేయడం సరికాదని, పింఛన్ మంజూరుకు చర్యలు తీసుకోవాలని గ్రామ పెద్దలు కోరుతున్నారు. ఇదే విషయమై ఇన్‌చార్జి ఎంపీడీఓ రాములమ్మ మాట్లాడుతూ కళావతికి పింఛన్ మంజూరైన మాట వాస్తవమేనని, ఆగస్టు నెలలో ఆమె పేరు జాబితాలో లేకపోవడంతో పింఛన్ ఇవ్వలేదన్నారు. దీనిపై ఆమె ఫిర్యాదు చేయడంతో డీఆర్‌డీఏ అధికారులకు లేఖరాశామని చెప్పారు. – గంట్యాడ

లక్కవరపుకోట: ఎల్.కోట సీతారామ ఆలయంలో శివలింగానికి అభిషేకం చేస్తున్న అర్చకులు




లలితా త్రిపుర సుందరిగా అమ్మవారు


వేపాడ: వల్లంపూడి అన్నప్రసాదం స్వీకరిస్తున్న భవానీలు

గజపతినగరం, చీపురుపల్లి, ఎస్.కోట నియోజకవర్గాల్లో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. దుర్గాదేవి ఆలయాలు, మంటపాల్లో అమ్మవారు శనివారం లలితా త్రిపుర సుందరీదేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. మహిళలు సామూహిక కుంకుమ పూజలు చేశారు. పలుగ్రామాల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. కొత్తవలస మండలంలోని చిన్నిపాలెం గ్రామంలో సర్పంచ్ రంగుడు పద్మలత ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మంటపంలో అమ్మవారిని ఎస్.కోట మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు దర్శించుకున్నారు.మంటపం ఆవరణలో నిర్వహిచిన చండీయాగం,హోమం తదితర పూజా కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. వేపాడ మండలంలోని గ్రామానికి చెందిన చిన్నవీధి యువసేన ఆధ్వర్యంలో సుమారు 4 వేల మందికి అన్నదానం చేశారు. – సాక్షి నెట్‌వర్క్


కొత్తవలస: చిన్నిపాలెం దుర్గాదేవిని దర్శించుకుంటున్న మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు


బొండపల్లి: దేవుపల్లిలో లలితా త్రిపుర సుందరిగా దర్శనమిచ్చిన రాజరాజేశ్వరీదేవి అమ్మవారు


దత్తిరాజేరు: కోమటిపల్లిలో పూజలందుకుంటున్న అమ్మవారు